# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 13 సెప్టెంబరు, 2025 | పేజీలు :08


## కొత్త కలెక్టరేట్‌కు నిధులు విడుదల చేయండి : ఎస్. విలాస్



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** ఆదిలాబాద్ కొత్త కలెక్టరేట్ నిర్మాణ పనులకు నిధులు విడుదల చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ అన్నారు. శుక్రవారం ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్‌తో కలిసి గురువారం కూలిపోయిన పాత కలెక్టర్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ విలాస్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయం నిర్మించి దాదాపు 80 సంవత్సరాలు పూర్తి అయిందని బుధవారం భవనంలోని ఒక భాగం కూలిపోయిన సమయంలో ఎవరు లేక పోవడం అదృష్టమని అన్నారు. మిగిలిన భాగం ఎప్పుడైన కూలే అవకాశం ఉందని అన్నారు. వీలైనంత తొందరగా నూతన భవనం పూర్తి చేసి నష్టం జరగకుండ చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఏఐటీయూసి ఆధ్వర్యంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రేపు నిర్వహించనున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా మహా సభలకు సహకరించాలని సిడిపిఓకు వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ ప్రతి ఒక్కరు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### నకిలీ క్రిప్టో కరెన్సీ కేసులో

# మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ అరెస్టు

**ప్రజాపక్షం/కరీంనగర్:** క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే మూడింతలు లాభాలు వస్తాయని నమ్మబలికి ప్రజలను మోసం చేసిన ప్రధాన నిందితులలో ఒకరైన మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్ ఆదేశాల మేరకు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే తీగలగుట్టపల్లికి చెందిన నునావత్ భాస్కర్ అన వ్యక్తి ఈనెల 11న కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోతిరాంపూర్‌కు చెందిన మాజీ కార్పోరేటర్ కట్ల సతీస్ తనకు పరిచయస్తుడని, అతను మెటా ఫండ్ క్రిప్టో అనే స్కీములో పెట్టుబడి పెట్టమని తనకు ఆశ చూపించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్కీములో రూ.50 లక్షలు పెట్టుబడి పెడితే మూడింతలు లాభాలువస్తాయనిసతీష్‌నమ్మబలికాడు. ఆయన మాటలు నమ్మి భాస్కర్ గత 2024 జూన్ నెలలో రూ.15 లక్షలను సతీష్‌కు ఇచ్చారు. అంతేకాకుండా మరింత మందిని ఈ పథకంలో చేర్పిస్తే ఎక్కువ లాభాలు వస్తాయని సతీష్ చెప్పడంతో భాస్కర్ తన పరిచయస్తులైన మరో 17 మంది ద్వారా గత సంవత్సరం జూన్‌లో సతీష్ మొత్తం రూ. 1. 20 కోట్లు వసూలు చేశాడు. మూడు నెలల్లో మూడింతలు లాభాలు ఇస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఒక్క రూపాయు తిరిగి ఇవ్వలేదని బాధితులు తమ ఫిర్యాదులో తెలిపారు. సతీష్‌ను అడినప్పుడు డబ్బులు ఇవ్వకుండా బెదిరించాడని బాధితులు ఆరోపించారు. దీనిపై కరీంనగర్ సిఐ నిరంజన్‌రెడ్డి, సిసిఎస్ సిఐ ప్రకాష్ గౌడ్, రూరల్ ఎస్ఐలు నరేష్, తిరుపతి, సిబ్బందితో కలిసి నిందితుడిని అరెస్టు చేశారు. సతీష్ నుంచి ఒక ఐపాడ్, రెండు మొబైల్ ఫోన్లు, కొన్ని బ్యాంకు అకౌంట్ వివరాలను స్వాధీనం చేసుకున్నారు. సతీష్‌ను కోర్టుకు, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలోఉన్నారని,వారినిత్వరలోనేపట్టుకుంటామని చెప్పారు.




### శిథిలావస్థలో ఉన్న పాఠశాలల, కళాశాలల

# భవనాలు పునః నిర్మించరూ..

ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అఖిల భారత విద్యార్థి సమైక్య ఏసు పెద్దపెల్లి జిల్లా సమితి అధ్వర్యంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను పునః నిర్మించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ హర్షకి వినతి పత్రం అందజేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు.ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను , కళాశాలలను ,సంక్షేమ హాస్టల్స్‌ను పునః నిర్మించాలని, అద్దె భవనాలలో ఉంటున్న సంక్షేమ హాస్టల్స్ కి సొంత భవనాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ విద్యా రంగానికి నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని పలు డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కు అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి విద్యా రంగ సమస్యలను యుద్ధ ప్రాతిపాదికన పరిష్కారిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్ పాల్గొన్నారు.



## మానేరు పరీవాహక ప్రాంతాల్లో అప్రమత్తం





ముత్తారం : మానేరు పరివాహ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ మధుసూదన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఉద యం మిడ్ మానేరులో అధిక మొత్తంలో వరద నీరు చేరడంతో మానేరు డ్యాం నుండి ఉద యం అధికారులు10 గేట్లు ఎత్తి దిగువ మానేరుకు నీటిని వదిలారు. మానేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నందున మండలంలోని మానేర్ పరివాహ గ్రామాలైన ఓడేడ్, ముత్తారం, పారుపల్లి,శాత్రాజ్ పల్లి ఖమ్మంపల్లి, సందరెల్లి, అడవి శ్రీరాంపూర్ గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులను మానేరు వైపు పంపవద్దన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.

## ఎల్‌ఎండి 8 గేట్లు ఎత్తి 18805 క్యూసెక్కుల నీటి విడుదల

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు కరీంనగర్‌లోని దిగువ మానేరు రిజర్వాయర్ (ఎల్‌ఎండి) లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. అధికారులు సాయంత్రం వర కు 8గేట్లను ఎత్తి 18805 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నా గత కొన్ని రోజులు గా కురుస్తున్న భారీ వర్షాలతో ఇన్‌ఫ్లో 20633 కు చేరింది. మోయతుమ్మెద వాగు, మిడ్‌మానేరు, కాకతీయ కాలువ నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది.



## రాజన్న దర్శించుకున్న సినిమా నటుడు చిన్న



**ప్రజాపక్షం/ వేములవాడ :** వేములవాడ రాజన్నను సినిమా నటుడు చిన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. దేవస్థానం అధికారులు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, ప్రసాదాన్ని అందజేశారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :** నేడు జగిత్యాల 33/11కెవి విద్యానగర్ సబ్‌స్టేషన్ మెయింటెన్స్ దృష్ట్యా రెండవ శనివారం రోజున ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని డిఈఈ గంగారాం తెలిపారు. జగిత్యాల పరిధిలో పాతబస్టాండ్, విద్యానగర్, ఎస్‌కెఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల రోడ్, రాజీవ్ చౌక్, ధర్మపురి బైపాస్ రోడ్,గాయత్రి దేవాలయం ప్రాంతం, గొల్లపల్లి రోడ్, తాతమ్మ గుడి ప్రాంతం, విజయపురి, దయాల్ నగర్, బైపాస్ రోడ్, సీతారాంనగర్ కాలనీ, శంకులపల్లి, బీరయ్యగుడి ప్రాంతం, కొత్తవాడ, హనుమాన్‌వాడ, గంజ్ స్ట్రీట్, టవర్‌సర్కిల్, ఖాజీపురప్రాంతం, ఉస్మాన్‌పురా, హాజారీ వీధి, సుతారీపేట్, వంజరివాడ, లద్దుఖాజా చౌరస్తా, అన్నపూర్ణ చౌరస్తా, విద్యానగర్, బ్రాహ్మణవాడ, సివిల్ ఆసుపత్రి, తహసీల్ చౌరస్తా, తిప్పన్నపేట్ గోపాల్‌రావుపేట, పెర్కపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని దీనికి ప్రజలకు సహకరించాలన్నారు.

### హాజీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హాజీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు. మరమ్మతు పనుల కారణంగా హాజీపూర్, టీకానపల్లి, పెద్దంపేట, బుద్ధిపెల్లి, కొండాపూర్, కర్ణమామిడి, రాంపూర్, కొండపల్లి, ధర్మారం గ్రామాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయంలో సహకరించాలని కోరారు.

## వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలికకు ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/కాసిపేట :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామానికి చెందిన చొప్పరి రాజయ్య, లక్ష్మి దంపతుల కుమార్తె సురక్షిత ఇటీవల వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని కాసిపేట 1వ గని (సర్వే విభాగం) చేయూత స్వచ్ఛంద సేవాసమితి బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసింది. ఈ సాయాన్ని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సంస్థ అధ్యక్షుడు ఆడెపు రవీందర్, ప్రధాన కార్యదర్శి అంకం రాయమల్లు చేతుల మీదుగా కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని, వీధి కుక్కల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలకు దాతలు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, మేకల ఆంజనేయులు, దాగం ఆనంద్, బండి గణేష్,కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఎంపిడిఒ

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** కాగజ్‌నగర్‌లోని గిరిజన పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని సోమవారం మండల పరిషత్ అధికారి కోట ప్రసాద్ సందర్శించారు. వసతి గృహంలోని రిజిస్టర్‌లను పరిశీలించారు. పారిశుద్ధ్యం, మంచినీటి సదుపాయం, వంటగది నిత్యావసర వస్తువుల నాణ్యత పరిశీలించి. విద్యార్థులతో జ్వరాలు లేదా ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే చికిత్స అందించాలని ఏఎన్ఎం సోంబకు సూచించారు. వసతి గృహంలో సోలార్ నీటి హీటరు చెడిపోయి చాలా కాలం అయిందని చలికాలం సమీపించినందున వెంటనే మరమ్మతులు చే యాలని లేదా కొత్తది అమర్చే విధంగా చూడాలని వి ద్యార్థులు ఎంపిడిఓను కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఎంపిడిఒ విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంట వార్డన్ వెంకటేశ్వర్ ఉన్నారు.



# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని ఈస్గాం ప్రధాన అర్చకుడు ఇందారపు సంతోష్ శర్మ, జూనియర్ అసిస్టెంట శ్రీనివాసచారిలు అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం శివాలయ ఆవరణలో స్యూర్ ఎన్‌జిఓ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహ విముక్తి భారత్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వయస్సు ఎదిగి ఎదగని అమ్మాయిలకు వివాహం చేయడం ద్వారా ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక రుగ్రమతలు కలుగుతాయన్నారు. బాల్య వివాహాలు జరిపినట్లయితే అట్టి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం బాల్య వివాహాలు నిర్మూలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బాల రక్షణ భవన్ సిబ్బంది జమున, స్యూర్ ఎన్‌జిఒ జిల్లా సమన్వయ కర్త బండి సంతోష్, ఫీల్డ్ సూపర్‌వైజర్స్ ప్రభు, దేవాజి, ఎవూరి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.




# ఫొటో ట్రేడ్ ఎక్స్ పో పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మందమర్రి :** ఫోటోగ్రఫీ రంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విప్లవాత్మక మార్పులు పొందుతోందని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్ ఓం కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న ఫోటో ట్రేడ్ ఎక్స్ పో పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇలాంటి ఎక్స్ పోలు ఫోటోగ్రాఫర్లకు కొత్త పరికరాలు, డిజిటల్ టెక్నాలజీల పరిచయం చేసి వృత్తిలో మరింత అవకాశాలు తెస్తాయని చెప్పారు. యువత ఫోటోగ్రఫీని వృత్తిగా ఎంచుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు సాధించవచ్చని సూచించారు. ఎక్స్ పోలో కెమెరాలు, లెన్సులు, డ్రోన్లు, ప్రింటింగ్ పరికరాలు, లైటింగ్ సిస్టమ్స్, ఫోటో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్లు, స్టూడియో మోడల్స్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఫోటోగ్రాఫర్లు, స్టూడియోలు, ఆసక్తిగల యువత తప్పక పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అప్పసు రామన్న, ప్రధాన కార్యదర్శి పోతరవేణి శ్వాస తిరుపతి, కోశాధికారి ముక్కెర శ్రీనివాస్, రా ష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు వడ్లకొండ కనకయ్య గౌడ్, పట్ట ణ అధ్యక్షులు పసుల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్, కోశాధికారి బద్రి సతీష్, గౌరవ సలహాదారులు నక్క తిరుపతి, ఎం.వి. సత్యనారాయణ, జాడి ముకుందాం, ఉపాధ్యక్షులు నక్క పవన్, ఆర్. సు జిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ వలస మణిరాజ్, ప్రచార కా ర్యదర్శి కె. హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బిసిల రాజకీయ హక్కుల సాధనకు ఉద్యమం తప్పనిసరి : మహేష్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** బిసిలకు రాజకీయ వాటా, హక్కుల సాధనకు ఐక్యంగా కదిలి రావాలని తెలంగాణ పొలిటికల్ బిసి జెఎసి మంచిర్యాల ఇంచార్జి మహేష్ వర్మ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తీన్మార్ మల్లన్న



ఆశయ సాధనకై పనిచేసేందుకు బిసి జెఎసిలో చేరారు. ఈ సందర్భంగా మహేష్ వర్మ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రజల్లో చైతన్యం వచ్చిందని, రానున్న రోజుల్లో బిసి పార్టీ జెండాను ఎత్తుకునేందుకు వివిధ పార్టీల కీలక నాయకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ నెల 17న తీన్మార్ మల్లన్న సారధ్యంలో ప్రకటించనున్న బిసి పార్టీలో పనిచేసేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బిసి పార్టీ పోటీ చేస్తుందని, అగ్రవర్ణాల నాయకులకు ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా బిసిలు అగ్రవర్ణాల కిందనుండి బయటపడి, స్వంత పార్టీ జెండాను పట్టుకోవాలని కోరారు. వచ్చేది బిసిల రాజ్యమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు పుట్ట లావణ్య, చిరంజీవి, తిరుపతి, ఠాకూర్ సుశీల్ కుమార్, సంగీత, జిల్లా నాయకులు దాస్యపు దీపక్ కుమార్, పడాల శివతేజ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో ఘనంగా కుంకుమ పూజలు



**ప్రజాపక్షం/జగిత్యాల :** 108 శ్రీ చక్ర సహిత లితమాత ఆలయం, శ్రీ సూర్య ధన్వంతరి ఆలయాల్లో మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. జగిత్యాల పట్టణ చింతకుంటలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో బాద్రపద మాస శుక్ల పక్షం, శుక్రవారం పంచమి పర్వదినం పురస్కరించుకొని మాతలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన లలితా సహస్ర నామాల స్థోత్ర పారాయణంగా గావించారు. పారాయణం అనంతరం మాతలు అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించారు. కుంకుమపూజ అనంతరం లక్కీ డీప్ ద్వారా ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మవారి శేష వస్త్రం ఆలయ పూజారి ఆశీర్వచనంతో సత్కరించారు. ఈకార్యక్రమంలో పొలాస ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య, డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వోడ్నా లశ్రీనివాస్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఆదివాసీ ముద్దుబిడ్డకు సన్మానం



**ప్రజాపక్షం/కాసిపేట:** చదువుతో జీవితాన్ని మార్చుకోవచ్చని ఆదివాసి సంఘాల నాయకులు తెలిపారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ ఎస్‌బిఐ బ్యాంక్ నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆదివాసి ముద్దుబిడ్డ చాహకటి యాదవ్ రావును శుక్రవారం ఆదివాసి సంఘాలు శాలువాతో ఘనంగా సన్మానించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మారుమూల అటవీ ప్రాంతంలో జన్మించి ఉన్నత విద్య సాధించి బ్యాంక్ మేనేజర్ స్థాయికి ఎదగడం ఆదివాసి సమాజానికి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, గ్రామీణ వైద్య సోదరులు కుర్సెంగా మహేశ్వర్, మడవి రామారావు, ఆదివాసి సంఘం సీనియర్ నాయకులు వెడ్మా బాపురావు, కుర్సెంగ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు ఆఫీసర్ మానసకు సన్మానం

**ప్రజాపక్షం/లక్షెట్టిపేట:** ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి సేవలందించిన వార్డు ఆఫీసర్ మానసను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్ అన్నారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీ 14వ వార్డు ఆఫీసర్ మానస బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం స్థానిక విశ్రాంతి భవనంలో మాజీ కౌన్సిలర్, వార్డు ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చింత అశోక్ కుమార్ మాట్లాడుతూ తాగునీటి సమస్య, డ్రైనేజ్ సమస్య, శానిటేషన్ సమస్య వంటి అంశాల్లో మానస ఎప్పుడూ అందుబాటులో ఉంటూ తక్షణమే స్పందించి పరిష్కరించేవారని అన్నారు. అటువంటి అధికారి బదిలీపై వెళ్లడం బాధకరమైనా, ఉద్యోగరీత్యా బదిలీలు సహజమని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత ప్రమోషన్ పొంది తిరిగి లక్షెట్టిపేటకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింత సువర్ణ అశోక్ కుమార్, కాంగ్రెస్ పార్టీ 14వ వార్డు అధ్యక్షులు ఉత్తూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# పత్తి దిగుమతులపై 50 శాతం సుంకం విధించాలి

## ఎఐకెఎంఎస్ డిమాండ్





**ప్రజాపక్షం/బైంసా:** పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకాలను ఎత్తివేసిన జిఓను ఉపశమహరించి, 50 శాతం సుంకాలు విధించాలని,పత్తి కొనుగోలు లో పిడిపిఎస్ విధానం ఎత్తివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఎఐకెఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేసారు.శుక్రవారం బైంసా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకాలను ఎత్తివేయడం వల్ల భారతదేశంలోని పత్తి రైతులకు తీవ్రమైన ఇబ్బంది ఎదురవుతుందని, భారత పత్తి రైతులకు గిట్టుబాటు ధర అందక ఆత్మహత్యల వైపు వెళ్ళవలసి వస్తుందని హెచ్చరించా రు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కనీస మద్దతు ధర కూడా అందక,స్థానిక వ్యాపారులకు అతి తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నదని,భారత రైతుల ను కాపాడాలనుకుంటే 50 శాతం విదేశీ పత్తిపై సుంకం విధించాలని డిమాండ్ చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం పత్తి సేకరణ పై కొత్త విధానాలను తీసుకొస్తూ ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం(పీడిపిఎస్)ను తీసుకురావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని,పాత విధానంలోనే సిసిఐ ద్వారా రూ.10,075 పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు దీనాజీ విట్టల్ సురేష్ సాయినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కుటుంబ లబ్ధి పథకంపై అవగాహన కల్పించాలి



**ప్రజాపక్షం/ నస్పూర్ :** జాతీయ కుటుంబ లబ్ధి పథకం (ఎన్ఎఫ్బిఎస్) గురించి సరైన అవగాహన లేకపోవడంతో చాలామంది పేదలు ఆర్థిక సహాయం కోల్పోతున్నారని తెలంగాణ బహుజన విద్యార్థి సమాఖ్య (టిబిఎస్ఎఫ్) నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమాని మరణిస్తే కేంద్ర ప్రభుత్వం అందించే రూ.20,000 ఆర్థిక సహాయం ప్రజలకు చేరడం లేదని వారు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం టివిఎస్ఎఫ్ నాయకులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సాయికుమార్, ప్రధాన కార్యదర్శి జాగిరి రాజశేఖర్ మాట్లాడుతూ పథకం గురించి తెలియకపోవడం వల్ల అర్హులైన వారు లబ్ధి పొందలేకపోతున్నారని తెలిపారు. దీంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (సెర్ప్) వద్ద రూ.60 కోట్ల నిధులు వినియోగం లేకుండా నిలిచిపోయాయని వారు వివరించారు. పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మండల, మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ ప్రక్రియను సులభతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని వారు పేర్కొన్నారు.

# కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు డాక్టర్ ప్రవీణ్ నిర్వహించారు. అనారోగ్యం ఉన్న వారిని రక్తహీనత పరీక్షలు చేశారు. వంట శాల, సరుకులు నిలువ గది, మరుగుదొడ్లు, తాగునీటి వసతి పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హస్టల్ ఇన్‌చార్జి సునీత, మమత, పద్మావతి, భాస్కర్, శ్రావణ్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వం డయాగ్నస్టిక్స్ ద్వారా అత్యాధునిక ఫ్యూజీ ఫిలిం మెమోగ్రఫీ




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్‌లోని విశ్వం డయాగ్నస్టిక్స్ ద్వారా ఫ్యూజి ఫిలిం సహకారంతో అత్యాధునిక అమ్యులేట్ ఇన్నోవాల్టి ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మెమోగ్రఫి (ఎఫ్ఎఫ్‌డిఎం) త్రీడి టెక్నాలజిని హైదరాబాద్ తర్వాత తెలంగాణలో నిజామాబాద్‌లోనే అందిస్తుందని విశ్వం డయాగ్నస్టిక్స్ అధినేత పెరిడాంటిస్ట్ యం.డి. డాక్టర్ రాస విజయ్ అన్నారు. శుక్రవారం స్థానిక సరస్వతి నగర్‌లో విశ్వం డయాగ్నస్టిక్స్‌లో హెల్త్ కేర్ టెక్నాలజిలోనే అగ్రగామి సంస్థ ఫ్యూజి ఫిలిమ్స్ ఇండియా అడ్వైజర్ షున్ సుకే హోండాతో కలిసి మెమోగ్రఫి సిస్టంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే సమస్యలలో గర్భాశయం ముఖ ద్వారా క్యాన్సర్, ఆ తర్వాత అంతకు మించిన రొమ్ముక్యాన్సర్లకు మహిళలు గురవుతున్నారని అన్నారు. మహిళలు ముఖ్యంగా 40 సంవత్సరాల నుండి 75 సంవత్సరాల వరకు గల మహిళలలో రొమ్ము క్యాన్సర్లకు గురవుతున్నారు. వారి అపోహలను నివృత్తి చేయుటకు, రొమ్ముక్యాన్సర్లను ప్రారంభదశలోనే గుర్తించుటకు ఈ మెమోగ్రఫి త్రీడి ఎంతో తోడ్పడుతుందని, ఖచ్చితమైన క్యాన్సర్ నివారణ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇది మహిళ పట్ల ఎంతో ఉపయోగకరమైన సాంకేతిక పరిజ్ఞానమని అన్నారు. నిజామాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఫిజి ఫిలిం వారి సహకారంతో అతి తక్కువ ధరలకే మెమోగ్రఫి త్రీడి పరీక్షలు నిర్వహించబడుతాయని, సోదరీమణులు ఇట్టి అవకాశాన్ని పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వివేకానంద్, గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ, డాక్టర్ ముకుంద్, వసంత, విష్ణు, డాక్టర్ కావ్య, ఆసుపత్రి సిబ్బంది సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటీజన్స్ సమాజ మార్గదర్శకాలు



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :** సీనియర్ సిటీజన్స్ సమాజ దర్శకులని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజాగౌడ్ అన్నారు. అడిషనల్ కలెక్టర్ ఛాంబర్‌లో నూతనంగా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన బి. రాజాగౌడ్‌ను తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ , పెన్షనర్స్ అసోసియేషన్స్ జగిత్యాల శాఖల అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా సంఘాల ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటీజన్స్ , పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ గతంలో జగిత్యాల రెవెన్యూ అధ్యక్షులుగా విశిష్ట సేవలు అందించారని అభినందించారు. వారి ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు వయోధికుల కోసం చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి పి.హన్మంతరెడ్డి, కోశాధికారి వెల్ముల ప్రకాష్‌రావు, సంయుక్త కార్యదర్శులు కట్ట గంగాధర్ తదితరులుపాల్గొన్నారు

# వరిలో ఎండాకు తెగులు

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల వరి పైరుకు ఎండాకు తెగులు ఆశించి పంట నష్టం కలుగుతుందని వ్యవసాయాధికారి మదుసూదన్ తెలిపారు. మోతాదుకు మించి ఎరువులు వాడిన దుబ్బ చేసే దశ నుంచి పూత దశలో ఉన్న పంటకు ఎక్కువగా ఆశిస్తుందని అన్నారు. దీనివల్ల దిగుబడులు తగ్గుతాయని చెప్పారు. ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయని దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీడరుకు మూడు గ్రాములు, అగ్రిమైసిన్, ప్లాంటమైసిన్, పిచికారి చేయాలని సూచించారు. కాపర్ సిలింద్రాలు, నత్రజని వాడొద్దని రైతులకు చెప్పారు.

# ఆదిమ గిరిజనులకు అందని ప్రభుత్వ పథకాలు..

## చెంచులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో గత 70 ఏళ్లుగా ఇళ్ళు లేని నిరుపేద ఆదిమ గిరిజనులు ఉన్నారని, వారికి ఇందిరమ్మ ఇళ్ళు ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని సిపిఐ(ఎంఎల్) పార్టీ ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కి ఆదే విధంగా ఐటిడిఏ పిఓకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని,సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి రాజేష్ అన్నారు. తను మాట్లాడుతూ కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదిమా గిరిజనులైన చెంచులు గత 70 సంవత్సరాల నుండి జీవిస్తున్నారు.వీరికి ఉండేందుకు గూడు లేదు నీడ లేదు నేటికి డేరాలు వేసుకొని ఉంటున్నారు.కాని ఇంత వరకు ఏ ప్రభుత్వం ఇళ్ళు,జాగా ఇవ్వలేదు.వీళ్లు గతంలో అడవిలో వేట మీద ఆధారపడి బ్రతుకు కొనసాగించే వాళ్లు,టైగర్ జోన్ వల్ల జీవన ఆధారం కోల్పోయారు. దీని వల్ల పేపర్,ప్లాస్టిక్ డబ్బాలు ఎరుకొని బ్రతుకుతున్నారు.వీళ్లకు పని ముట్లు లేవు.అందరిలాగా ఇల్లు కట్టుకొని బ్రతికే పరిస్థితి లేదు.వీళ్ళ బ్రతుకులు దిన దిన గండంగా ఉంది.వీళ్లకు ఇంత వరకు ఇల్లే లేవు,వీళ్లు చెంచులని ఎవరు పట్టించుకున్న దాకలాలులేవు,ఇకనైన ప్రభుత్వం ఇక్కడ ఉన్న చెంచు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి ఆదుకోవాలని ఎమ్మెల్యేని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వ పరంగా ఇందిరమ్మ ఇండ్లు,అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు అని తెలిపారు.

# అంగన్‌వాడీలకు కనీస వేతనంతో, ఉద్యోగ భద్రత కల్పించాలి



**ప్రజాపక్షం/కడం :** ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలంలో కడం,బెల్లాల్ సెక్టార్ లో 12 మంది టీచర్లు 8మంది ఆయాలు టీఎన్జీవోలో చేరారని టీఎన్జీవో జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ తెలిపారు.ఈ సందర్భంగా గుడిసె సంపూర్ణ మాట్లాడుతూ టీఎన్జీవో ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్‌లు ఆయాల సమస్యలపై నిరంతరం పోరాడుతుంది.ప్రభుత్వం నుండి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ అంగన్వాడి టీచర్లకు,ఆయాలకు ఇవ్వాలన్నారు.ఖానాపూర్ ఐసిడిఎస్ పరిధిలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని.అంగన్వాడీ ఆయాలకు కనీస వేతన చట్టం కింద 26,000 వేతనం ఇవ్వాలన్నారు.40 సంవత్సరాల నుండి చాలీచాలని వేతనాలతో గ్రామీణ ప్రాంతాలలో బాలింతలకు గర్భిణీలకు,చిన్న పిల్లలకు సేవలు అందిస్తున్నామని, పని ప్రదేశాలలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలి.అంగన్వాడి విధుల్లో నిర్వహిస్తున్న టీచర్లకు ఆయాలకు అన్ని రకాలుగా ఆవేలెన్సు కల్పించి,ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం కల్పించాలని, ప్రభుత్వాన్ని కోరుతున్నాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా ఉపాధ్యాక్షురాలు వరలక్ష్మి ,కడం బెల్లాల్ సెక్టార్ల టీచర్లు విజయ,నిర్మల,రత్నమాల,మంగ,లక్ష్మి ,జ్యోతి,భాగ్య రేఖ,బాలమణి,తదితరులు ఉన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట:** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం పెంచికల్‌పేట మండలం ఎర్రగుంట గిరిజన గ్రామంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, టబ్బులు, కొబ్బరి చిప్పలు, రబ్బరు టైర్లలో నీరు నిల్వ ఉంచితే మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం ఆయన స్థానిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందుతున్నదని పరిశీలించి, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య బోధించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ పద్మ, ఆశా వర్కర్ పద్మ, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ గోపాల్, ఇస్తారిలు పాల్గొన్నారు



# యూరియా నిల్వలు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి



**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని జిల్లా వ్యవసాయాధికారి గోవిందు శుక్రవారం ఆకస్మికంగా ప్రాథమిక సహకార సంఘాన్ని గ్రోమోర్ సెంటర్లను తనిఖీ చేశారు. మండలంలోని యూరియా నిల్వలను అలాగే పీఓఎస్ మిషన్ స్టాక్‌ను పరిశీలించారు. వాతావరణ పరిస్థితితో రైతులందరూ యూరియా తక్కువ మోతాదులో వాడాలని ఎక్కువ మొత్తంలో వాడిన యెడల చీడపీడలు ఆశిస్తాయని తెలిపారు. రైతులందరికి యూరియా అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు మండల వ్యవసాయాధికారి పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలపై అవగాహన

**ప్రజాపక్షం/జన్నారం :** రైతులు సాగుచేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించి అవగాహన కల్పించినట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం జన్నారం మండలంలోని చింతగూడెం, కిష్టాపూర్ గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న మిర్చి, బీరకాయ, కాకరకాయ వంటి కూరగాయల తోటలను ఉద్యాన అధికారి కె. సహజ సందర్శించారు. ఈ సందర్భంగా పంటలలో కనిపించే చీడపీడలు, సస్యరక్షణ చర్యలు, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు ఇచ్చారు. అలాగే మంచిర్యాల జిల్లాలో ఉద్యాన పంటలపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీల వివరాల ను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి ఆడెపు శేఖర్, ఆయిల్ పామ్ రైతులు సాయి వంశీ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు



# టియు హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

## ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్
## ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు వినతి అందజేత




**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :** టియు హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ కన్వీనర్ సంజీవ్ అన్నారు. శుక్రవారం టియు హాస్టలలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. టియులోని అన్ని హాస్టల్‌లలో మౌలిక వసతులు మెరుగుపర్చాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మామిడాల ప్రవీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎఐఎస్ఎఫ్ నాయకులు కన్వీనర్ సంజీవ్, కోకన్వీనర్ చందు మాట్లాడుతూ తెలంగాణకు తలమానికంగా ఉన్న తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులు నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. భోజనంలో నాణ్యత లోపించిందని, తాగునీరు, పారిశుధ్యం పట్ల నిర్వహణ లోపముందని విమర్శించారు. హాస్టల్ గదులలో ఫ్యాన్లు, లైట్ల మరమ్మతులు లేని కారణంగా రాత్రి వేళల్లో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంజీవ్, చందు, ప్రవీన్, అజయ్ పాల్గొన్నారు.

## విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలకు హాజరుకండి




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః** ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు కరీంనగర్‌లోని శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరగనున్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని మాజీ కార్పోరేట్ మాచర్ల రజిత ప్రసాద్ గౌడ్ ఆద్వర్యంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావును ఆహ్వానించారు. తీగలగుట్టపల్లిలోని రాజేందర్‌రావు స్వగృహంలో ఆయనను కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సంధర్భంగా రాజేందర్‌రావు విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలకు తప్పకుండా హాజరవుతానని వివరించారు. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిచాలని రాజేందర్‌రావు ధర్మకర్తలకు మండలి సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ మాచర్ల రజిత ప్రసాద్ గౌడ్, స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట జగన్, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తోజు రామ్ కుమార్, ధర్మకర్తలు వేగ్గలం రామకృష్ణ, ఎదులాపురం మహేష్, గోకులకొండ నరసింహాచారి, వంగల నవీన్, రాగిటి కవిత, గోకులకొండ కరుణాకర్ తదితరులున్నారు.

## అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా నూతన బాధ్యతలు స్వీకరించిన రాజగౌడ్



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ః** జగిత్యాల జిల్లా సమీకృత భవన సముదాయంలో శుక్రవారం నూతన బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజగౌడ్ మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్చం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో జిల్లా అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాధ్యతలు విధులు నిర్వహిస్తానని తెలిపారు.

## నేడు విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలి

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల,తక్కల్ల పెల్లి 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం మరమ్మత్తులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు మల్యాల ట్రాన్స్కో ఏఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు .విద్యుత్ మరమ్మత్తుల వల్లమల్యాల సబ్ స్టేషన్ పరిధిలో మల్యాల, ముత్యంపేట, రాజారాం, నూకపల్లి, మల్యాల క్రాస్ రోడ్ గ్రామాలకుతక్కలపల్లి సబ్టేషన్ పరిధిలో తక్కలపల్లి, మ్యాడంపల్లి మానాల గ్రామాల గృహ వినియోగదారులకు, వ్యవసాయబావులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వివరించారు.ఈ విద్యుత్తు అంతరాయనికి వినియోగదారులు ,రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

## విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఆనందిత ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తూ వారి నైపుణ్యాలను పెంపొందించడానికి ఆనందిత ఫౌండేషన్ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని నిర్మల్ జిల్లా వి ద్యాశాఖ అధికారి (డీఈఓ) దర్శనం భోజన్న అన్నారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మోటివేషన్, నైతిక విలువలు,కెరీర్ గైడెన్స్ వంటి అంశాలపై ఆనందిత ఫౌండేషన్ తరుచుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తోంది,ఈ సేవలను గాను,ఫౌండేషన్ చైర్మన్ భోజన్న ను ఘనంగా సత్కరించారు.



## సహాయం చేయడానికి ఉండాల్సింది డబ్బు కాదు, మంచి మనసు

## సింగరేణి యువ బలగం సభ్యులు



**ప్రజాపక్షం/ముత్తారం :** సహాయం చేయడానికి ఉండాల్సింది డబ్బు కాదు, మంచి మనసు ఉండాలని సింగరేణి యువ బలగం సభ్యులు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామంలో సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో పుట్టిన రోజు సందర్భంగా ఓ సి పీ టు లో ఈపీ ఆపరేటర్ గా పనిచేస్తున వీరగోని సంతోష్ కూతురు వీరగోని వర్షిణి పుట్టిన రోజు సందర్భంగా మచ్చుపేట గ్రామంలోని రెండు నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. పుట్టిన రోజును కేవలం వేడుకలతో కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా జరపాలని ద్వారా సందేశం ఇ చ్చారు.లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ పుట్టిన రోజు వేడుకను సమాజానికి అంకితం చేసిన నిర్వాహకుడికి కృతజ్ఞతలు తెలిపారు.జన్మదినం అనేది కేవలం సంబరాలకు మాత్రమే కాదు సహాయం చేయడానికి ఒక మంచి అవకాశం అని నిర్వాహకులు పేర్కొన్నారు. సింగరేణి యువ బలగం సభ్యులు బోయినపల్లి శ్రీకాంత్ రావు, బుడిగే క్రాంతి, గండి శ్రీనివాస్, మండ సురేష్,, అంబటి చిరంజీవి, బొడ్డు వినయ్, సతీష్, ప్ర దీప్,మచ్చుపేట దుండె రాజేందర్, గొర్ల కుమార్, తిరుమల రాజు, తాడూరి నారాయణ,తాడూరి అంజయ్య పాల్గొన్నారు.

## సేవ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### రూరల్ మండలాధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి సూచనలతో వేములవాడ రూరల్ పార్టీ అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మండల కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కోనరావుపేట మాజీ జెడ్పిటిసి పల్లం అన్నపూర్ణని శాలువతో సన్మానించారు. సెప్టెంబర్ 17న రేంద్ర మోడీ జన్మదినన్ని పురస్కరించుకొని సిరిసిల్ల జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో మండలం నుండి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేయాలని. అదేవిధంగా సెప్టెంబర్ 18న నిర్వహించే స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతి బూత్ లో కార్యకర్తలు నాయకులు పాల్గొని కార్యక్రమంని విజవంతం చేయాలనీ సెప్టెంబర్ 25 నా ప్రతి గ్రామ స్థాయిలో మొక్కలు నాటాలని అక్టోబర్ 2 నా గాంధీ మరియు లాల్ బహదూర్ శాస్త్రి గార్ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం, కార్యక్రమ కో కన్వీనర్ మందా రాజేందర్, మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, ప్రధాన కార్యదర్శి తోటా శేఖర్, ఉపాధ్యక్షులు లింగంపల్లి కొండయ్య, పల్లికొండ నారాయణ, గుంటి వంశీ కృష్ణ, కార్యదర్శులు గుమ్మడి శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్చార్జ్ చింతకుంట గౌతమ్, బూత్ అధ్యక్షులు ఆది జలంధర్, నల్ల వెంకట్ రెడ్డి, పంచరపుల మహేష్, చొప్పరి కరుణాకర్, లింగంపల్లి రాజు, కల్లెడ్ల నరేష్, లక్కం తిరుపతి, మారం రాజేందర్, చొప్పరి కరుణాకర్, రోండ్ల మహేష్, ముస్కం సంజీవ్, సింగర వేణి హరీష్, తిరుపతి, చందనగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లియోక్లబ్‌లో చేరి విద్యార్థి దశలోనే సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః** విద్యార్థి దశలోనే కళాశాల యువతలో, పాఠశాల విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో లయన్స్ ఇంటర్నేషనల్ లియో క్లబ్‌లను ఏర్పాటు చేయడం హర్షదాయకమని లయన్ సింహరాజు కోదండరామ్ అన్నారు. శుక్రవారం అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన లియో క్లబ్ ఆఫ్ అల్ఫోర్స్ వుమెన్స్ డిగ్రీ కాలేజీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అల్ఫోర్స లియో క్లబ్ అద్భుతమైన సమాజహిత కార్యక్రమాలను చేసి పౌర సమాజ ప్రశంసలను, పలు అవార్డులను పొందడం గర్వకారణమని తెలిపారు. కూడిన 20 మంది లియో సభ్యులతో ఇన్‌స్టలేషన్‌లో భాగంగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఫస్ట్ వైస్ గవర్నర్ లయన్ మోరె భద్రేశమ్ నిర్వహించి సభ్యుల బాద్యతలను వివరించారు. లయన్ భద్రేశం మాట్లాడుతూ విద్యార్థులు తమ అకాడమిక్ అంశాలతో పాటు వివిధ క్లబ్బుల్లో చేరి నూతన అనుభవాలను, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ లయన్ వి.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ యువత పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి లియో సేవలు ఎంతగానో ఉపకరిస్తున్నాయని అన్నారు. కెప్టెన్ డా.బుర్ర మధుసూధన్ రెడ్డి ఆద్వర్యంలో నిర్వహించిన లయన్ ఇనుగుర్తి రమేష్, లయన్ వి.జగదీశ్వర చారి, లయన్ డి.తిరుపతి రెడ్డి, లయన్ జి.చంద్రశేఖర్, లయన్ పి.సురేందర్, లయన్ ఎం.మహేందర్ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కార్మిక రాజ్య స్థాపనే ఏచూరి సీతారాంకు నిజమైన నివాళి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** వర్గ పోరాటాలను ఉధృతం చేసి కార్మిక రాజ్య స్థాపన చేయడమే ఏచూరి సీతారాంకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కోట శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఐక్యత కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏచూరి చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. దేశ పార్లమెంటును ప్రజా సమస్యల చర్చా వేదికగా మార్చి, వ్యక్తిగత విమర్శల నుండి పార్లమెంటును దూరం చేసిన గొప్ప పార్లమెంటేరియన్ ఆయన అని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే అనేక పోరాటాలు నిర్వహించారని, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చే కార్మిక, ప్రజా వ్యతిరేక చట్టాల వల్ల దేశానికి, ప్రజలకు కలిగే నష్టాలపై అనేక రచనలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జె.రాజేందర్, గొడిసెల కార్తీక్, గెడెం టికానంద్, నెర్పల్లి అశోక్, చాపిలె సాయి క్రిష్ణ, నాయకులు వెలిశాల కృష్ణమాచారి, వసాకే సాయి తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి కల్పించే దిశగా మహిళలు అభివృద్ధి చెందాలి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలో స్వయం సహకార మహిళ సంఘాలకు ఈడిఐఐ ఆధ్వర్యంలో ఆగ్రో మిల్లెట్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రొడక్ట్స్ పై అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మెప్మా అధికారులు తెలిపారు. ఖానాపూర్ పట్టణంలో గల మెప్మా ఆఫీస్‌లో ఈడిఐఐ,యాక్సెంచర్ ఆధ్వర్యంలో సభ్యుల ఎంపిక నిర్వహణ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీ.సుందర్ సింగ్ మాట్లాడుతూ ఆగ్రో మిల్లెట్, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రొడక్ట్స్ ద్వారా మహిళలు తయారు చేసిన వస్తువులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని,చిరు ధాన్యాలు,సిరిలు ఇచ్చే ధాన్యాలు అని అన్నారు.అదే విధంగా మెప్మా పీడీ సుభాష్ మాట్లాడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంచుకోని మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలని తమ కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెప్మా సిఓ స్రవంతి,సిఓ రవీందర్,మెప్మా రిసోర్స్ ట్రైనర్ భూక్యా దేవేందర్,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవి,మాస్టర్ ట్రైనర్ ఆలేఖ్య పలు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా కవులను గుర్తించాలి




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్మల్ జిల్లా కవులను గుర్తించాలని జిల్లా కవులు,రచయితలు అన్నారు.శుక్రవారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడారు.జిల్లాలో వచన కవిత్వం,పద్య కవిత్వం, వ్యాసాలు, కథలు, కథానికలు, తాత్విక వ్యాసాలు రాసిన చేయి తిరగిగిన కవులు రచయితలు ఎంతో మంది ఉన్నారన్నారు.వారి రచనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రసిద్ధి చెందాయని పేర్కొన్నారు.అంతేకాకుండా ఎక్స్ రే,రంజని కుందర్తి,సినారే అవార్డులు అందుకున్న కవులు కూడా ఇక్కడ ఉన్నారని తెలిపారు.గత నాలుగు దశాబ్దాలుగా సాహిత్యాన్ని శ్వాసగా చేసుకొని రచనలు రాస్తున్నారన్నారు.కానీ ప్రభుత్వం వీరిని గుర్తించకపోవడం బాధాకరమన్నారు.ప్రభుత్వం ఒకటి రెండు బుక్కులు రాసిన కవులకు ఆదరిస్తుంది కానీ,దశాబ్దాలుగా ఎన్నో బుక్కులను రాసిన వారిని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మమ్మల్ని వెనుకబడిన జిల్లా వాసులుగా అవార్డుల కమిటీ చూస్తుందన్నారు.ఆదిలాబాద్ జిల్లా పోరాట యోధుల గడ్డ అని,ఈ జిల్లాను ప్రభుత్వం పరిగణలోనికి తీసుకోవాలని సూచించారు.అంతేకాకుండా ఈ జిల్లాలో ఎంతోమంది కవులు, రచయితలు ఉన్న గుర్తింపు లేదన్నారు. ఇప్పటికైనా అవార్డుల కమిటీ దృష్టి పెట్టాలన్నారు.రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్మల్ జిల్లా కవులను పరిగణలోకి తీసుకొని గద్దర్,దాశరథి అవార్డులను అందజేయాలని కోరారు. జిల్లా కవులు, రచయితలు డాక్టర్ దామెర రాములు, డా.కృష్ణంరాజు, నేరెళ్ల హనుమంతు,తదితరులు పాల్గొన్నారు.

## కుమార్‌వాడీ పాఠశాలకు పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**కరీంనగర్‌లోని ప్రభుత్వ కుమార్‌వాడీ పాఠశాల పూర్వ విద్యార్థులు పదవ తరగతి(1985–86) 39వ సంవత్సర సమ్మేళనంలో భాగంగా హౌసింగ్‌బోర్డు కాలనీలోని పాఠశాలను సందర్శించారు. ఆ పాఠశాల పై అంతస్తు ప్రహారీగోడ చిన్నగా ఉండడం కారణంగా విద్యార్థులకు ప్రమాదకరంగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రహారీగోడకు గ్రిల్స్ వేయిస్తే బాగుంటుందని, విద్యార్థులు పడిపోతారేమోనన్న ఆందోళనతో ఉన్నామని పేర్కొన్నారు. విద్యార్థుల ఇబ్బందులను గమనించి పూర్వ విద్యార్థులు రూ.30 వేలతో గ్రిల్స్ వేయించడంతో సౌకర్యంగా మారింది. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము చదివిన పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి సహాయ చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొత్త శ్రీనివాస్, గుండా గోపాల్, తోట రమణ, దేవులపల్లి వాణి, ఆది కరుణాకర్, శ్రీనివాస్, విజయ భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, పసుల నందు, జీవన్, నరేందర్, ప్రవీణ్ తదితరులున్నారు.

## నాయకత్వపు లక్షణాలు పెంపొందించేందుకు కృషి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** విద్యార్థిని విద్యార్థుల్లో నాయకత్వపు లక్షణాలు పెంపొందించే అందుకే పాఠశాలలో మాక్ ఎలక్షన్స్ నిర్వహించినట్లు గర్రెపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డా. గోల్డి బల్బీర్ కౌర్ అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్లో శుక్రవారం నమూనా ఎన్నికలు నిర్వహించారు.విద్యార్థులలో భారత ఎన్నికల విధానం పట్ల అవగాహన కల్పించడానికి,విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి మాక్ ఎలక్షన్స్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ ఎన్నికలద్వారా సమర్థవంతమైన పాఠశాల నిర్వహణ కోసం విద్యార్థి నాయకులను ఎన్నుకొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. గోల్డి బల్బీర్ కౌర్,వైస్ ప్రిన్సిపాల్ కొండయ్య మరియు సాంఘీక శాస్ర ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాస్, అనిల్, సంధ్య ఉపాధ్యాయ,ఉపాధ్యాయునీలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అధునాతనమైన గుండె శస్త్ర చికిత్స విజయవంతం



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** కేవలం మెట్రోపాలిటన్ పట్టణాలకు మాత్రమే పరిమితమైన మిక్స్ (మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ) ప్రస్తుతం స్థానిక రెనే హాస్పిటల్‌లో సీనియర్ రోబోటిక్ అండ్ మిక్స్ కార్డియోథొరసిక్ సర్జన్ డా.రవికుమార్ విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని యాజమాన్యం తెలిపింది. ఈ సంధర్భంగా డా.రవికుమార్ మాట్లాడుతూ అతి చిన్న కోత ద్వారా గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయడం దీని ప్రత్యేకత అన్నారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన అజయ్‌కుమార్ అనే 15 సంవత్సరాల బాలుడు పుట్టుకతోనే గుండెలో రంధ్రం కలిగి ఉండడం వల్ల గత పదిహేను సంవత్సరాలుగా ఆయాసం రావడం, ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ రావడం, గుండెదడ, బరువైన పనులు చేయలేకపోవడం వంటి సమస్యలతో బాధపడడం జరిగిందని పేర్కొన్నారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న ఈ గుండె ఆపరేషన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తిగా ఉచితంగా చేశామన్నారు. ఈ ఆపరేషన్ జరిగిన కేవలం మూడురోజుల్లోనే పేషెంట్ తన బాధ నుంచి పూర్తిగా కోలుకుని గతంలో ఉన్న సమస్యలన్నీ తీరిపోవడంతో ఆ కుటుంబం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సంధర్భంగా రెనే హాస్పిటల్స్ అధినేత ప్రొఫెసర్ డా.బంగారు స్వామి మాట్లాడుతూ కరీంనగర్ స్థాయిలోనే ఇంత అధునాతనమైన శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లోనూ తెలియాల్సిన అవసరముందన్నారు. అధునాతనమైన ఆపరేషన్ చేయాలంటే అత్యధిక సదుపాయాలతో కూడిన హాస్పిటల్‌తో పాటు ఎంతో అనుభవం కలిగిన రోబోటిక్, మిక్స్ కార్డియోథొరసిక్ సర్జన్ డా.రవికుమార్ లాంటి వైద్యులు ఉండడం అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్యం అనేది ఎఐ టెక్నాలజీ ద్వారా ఎంతో పురోగతి సాధించడం జరుగుతోందని, ఎక్కడో విదేశాల్లో ఉండి కేవలం టెక్నాలజీ ద్వారా ఈ దేశంలో ఆపరేషన్లు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి ఆపరేషన్లు మన ప్రాంతంలో చేయాలనే ఒక విజన్‌తో రెనే హాస్పిటల్ ముందకు వెళ్తూ సామాన్యులకు అధునాతన వైద్యం అందించాలనేది ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తెలంగాణలో మొట్టమొదటిసారిగా (హైదరాబాద్ మినహా) రోబోటిక్ టెక్నాలజీ ద్వారా కీలుమార్పిడి శస్త్రచికిత్స విధానాన్ని వచ్చే అక్టోబర్ చివరి వారంలో కరీంనగర్ రెనే హాస్పిటల్‌లో ప్రారంభించడం జరుగుతుందన్నారు. అతి తక్కువ ఖర్చులో అందించాలనేది లక్ష్యమని, అందుకోసం గత రెండు నెలలుగా శిక్షణ పొందుతున్నానని వివరించారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా.దినకర్ తాటిమట్ల, పిల్లల గుండె వైద్య నిపుణులు డా.రాజా విజయేందర్ రెడ్డి, మెడికల్ సూపరింటెంట్ డా.రవీంద్రాచారి, హాస్పిటల్ నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ బాబు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాగులు పంపిణీ



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొత్తపల్లి మండలం ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విధ్యార్థులకు దాత సహకారంతో బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విధ్యార్థులక అందుతున్న సౌకర్యాలను, సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో రాణించి సొంత కాళ్లపై నిలబడాలన్నారు. పదిమందికి సాయం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విధ్యార్థుల కోసం ఎలాంటి సహకారమైన అందిస్తామని, పట్టుదలతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ సంధర్భంగా విధ్యార్థులకు బ్యాగులు అందజేసిన దాత మేడి నగేష్‌ను అభినందించారు. పాఠశాలలకు పంపిణీ చేసిన గోడ గడియారాల్లో సూచించిన 12 అంశాలను తెలిపే విధ్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్లానింగ్ కో ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, ఎంఈవో ఆనందం, ఎంపిడివో శ్రీనివాస్, ఎంపివో నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## పోషకాహారంతో తల్లి, బిడ్డ క్షేమం



**ప్రజాపక్షం/అంతర్గాం :** ప్రతి గర్భిణి అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని, ప్రసవానికి కూడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చేయించుకోవాలని తద్వారా తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారని అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్ తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం బ్రహ్మణపల్లి, మర్రిపల్లి గ్రామాల అంగన్వాడీ కేంద్రాల్లో పోషక ఆహార వారోత్సవాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గర్భిణిలకు శ్రీమంతం, చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. గర్భిణిలు, బాలింతలు తమ ఆరోగ్యం పట్ల ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలో మండల వైద్యాధికారి ఉదయ్‌కుమార్ వివరించారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎసీడీపీవో సంపద కుమారి, పిహెచ్‌వో పుష్పలత, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అంజలి, ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, లక్ష్మి, అంగన్వాడీ ఉపాధ్యాయురాళ్లు పి.భాగ్యశ్రీ, విజయలక్ష్మి, రుక్మిణి, కస్తూరి, ఎఎన్‌ఎంలు అన్నపూర్ణ, శిరీష, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో శిథిలావస్థకు వచ్చిన భవనాలను పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులు నూతన భవనాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం కోరారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు అరకొర వసతులతో నడుస్తున్నాయని కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తామని ప్రభుత్వాలు ప్రగాల్భాలు పలుకుతున్నప్పటికీ వానకు వలవల ఎండకు విలవిలాడుతున్న చదువులకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని, భవనాలను, పాఠశాల వాతావరణాన్ని పట్టించుకోకుండా విద్యకు మెరుగయ్యే ఏ వసతుల్ని అందించే దాంట్లో కూడా జిల్లా విద్యాధికారులు చొరవ చూపటం లేదని రఘురాం అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యారంగాన్ని బోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, కుషాల్, సుభోద్, టోకు తదితరులు పాల్గొన్నారు.

## 16న జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ సమావేశం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 16న ఉదయం 10.30 గంటలకు ఎంపీ ధర్మపురి అరవింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరగనుందని డీఆర్‌డీఓ సాయగౌడ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులచే వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దిశ సమావేశంలో చర్చించటం జరుగుతుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావలని కోరారు.

## విధుల్లోకి గ్రామ పరిపాలన అధికారులు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మహ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల్లో తమకు కేటాయించిన గ్రామాలలో గ్రామ పరిపాలనాధికారులు శుక్రవారం విధుల్లో చేరారు. నిజాంసాగర్ మండలానికి 11 మంది గ్రామ పరిపాలనాధికారులుగా పదవుల్లో చేరారు. ఇందులో భాగంగా గ్రామాల వారీగా బంజేపల్లి శేఖర్, మల్లూర్ రమేష్, అచ్చంపేట్ సంగమేశ్వర్‌గౌడ్, బ్రాహ్మణపల్లి శ్రీనివాస్, ఆరేపల్లి రమేష్, నర్సింగ్‌రావ్‌పల్లి దిలీప్‌కుమార్ వెల్గనూర్ కిరణ్, జక్కాపూర్ మంజుల, ఒడ్డేపల్లి అంజయ్య, మాగి, గోర్గల్ సాయిబాబలను నియమించారు. ఈ మేరకు వారు తహసీల్దార్ బిక్షపతి ఆధ్వర్యంలో విధుల్లో చేరారు. అదేవిధంగా మహ్మద్‌నగర్ మండలంలో 11 మంది గ్రామ పరిపాలనాధికారులు విధుల్లో చేరగా వారిలో గున్కుల్ మల్లేష్, హసన్‌పల్లి వినోద్, నర్వ సంగయ్య, బూర్గుల్ ఆంజనేయులు, తుంకిపల్లి విఠల్, కొమలంచ శంకర్, తెల్గాపూర్ భాస్కర్, సింగితం సురేష్, గాలీపూర్ నాగరాజు, మగ్దుంపూర్ సిద్ధిరాములు, గోవర్దన్‌లను నియమించినట్లు తహసీల్దార్ సవాయిసింగ్ తెలిపారు. వారు ఈరోజు పదవీ భాధ్యతలు స్వీకరించారు.

## సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొవాలి



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** జీవితంలో సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొవాలని ప్రముఖకవి పెద్దింటి అశోక్ అన్నారు.శుక్రవారం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రేరణజీవన నైపుణ్యం గురించి వివరించారు.ఒత్తిడిని తగ్గించుకుని సాంఘీక మానసిక సామర్థ్యాలను నేర్చుకోవాలని సూచించారు. సమస్యలను అధిగమించి పురోగతి సాధించాలని అన్నారు.విద్యా వ్యక్తిత్వ వికాసాన్ని నేర్పుతుందని చెప్పారు,కార్యక్రమంలో రచయిత పెద్దింటి అశోక్,ప్రధానోపాద్యాయులు మనోహరచారి,ఉపాద్యాయులు,విద్యార్థుల బృందం పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై సీఎం రేవంత్‌కు కనీస అవగాహన లేదు..

## మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కనీస అవగాహన లేని దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చాక ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. సీతారాంపూర్‌లోని ఓ హోటల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు పగులు ఏర్పడితే కాళేశ్వరం కూలిందని మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. భవిష్యత్తు అవసరాల కోసం తెలంగాణకు కరువు కాటకాలు రావద్దని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూడడం సిగ్గుచేటన్నారు. సీఎం కెసిఆర్‌ను ఇష్టారీతిగా బూతులు తిట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలు పనిగా పెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులకు ఎల్లంపల్లి ప్రాజెక్టుపై అవగాహన రాహిత్యాన్ని చూసి ప్రజలు నవ్వుతున్నారన్నారు. గతంలో సీఎంలుగా పనిచేసి ఎన్టీఆర్, చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డిలు తమ హయాంలో చేసిన పనులను ప్రస్తుత సీఎం రేవంత్ తాము చేసినట్లుగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌ను 2016లోనే రైతులకు సాగునీరు అందించామని, 70 వేల మంది రైతులకు ఈ రిజర్వాయర్ ఆధారమన్నారు. ప్రజలను మోసం చేసే పొలిటికల్ డ్రామాలు ఆపాలని హితవు పలికారు. 20 టిఎంసిల నీరు హైదరాబాదుకు తరలిస్తే ఎల్లంపల్లి నీరు 557 మీటర్ల ఎత్తు ఉన్న మల్లన్న సాగర్‌కు నీరు ఎలా తరలిస్తారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఎన్నికలకు పోవడం లేదన్నారు. కంకణాల విజయేందర్ రెడ్డి, ఉప్పుల గంగాధర్, రామిడి సురేందర్, వేముల దామోదర్, కోల లింగారెడ్డి, నాయకులు తదితరులున్నారు.

## ఎఎంసి చైర్మన్‌కు సన్మానం



**ప్రజాపక్షం /రామగిరి :** కమాన్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజును పెద్దపేల్లి మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల నూతనంగా కమాన్పూర్ ఏఎంసి చైర్మన్ గా రాజు పదవి బాధ్యతలు చేపట్టగా పెద్దపల్లి మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది.

## విధుల్లో చేరిన గ్రామ పరిపాలన అధికారులు

**ప్రజాపక్షం/ రామగిరి :** రామగిరి,కమాన్ పూర్ మండలంలో గ్రామ పరిపాలన అధికారులు వీధుల్లో చేరినట్టు రామగిరి తహసిల్దార్ సుమన్, కమాన్పూర్ తాసిల్దార్ వాసంతి శుక్రవారం తెలిపారు. రామగిరి మండలం గ్రామ పరిపాలన అధికారులుగా ఆరుగురు వీధుల్లో చేరగా ఇందులో, బండారి వెంకటేశ్వర్లు ఆదివారం పేట, పెరక వెంకటేశ్వర్లు లదనాపూర్, భోగే నవీన్ రత్నాపూర్, సిద్ధం తిరుపతమ్మ కల్వచర్ల, ఉప్పు దేవయ్య బేగంపేట, కలవేన రాజేశం గ్రామ పరిపాలన అధికారులువిధుల్లో చెరగా,అలాగే కమాన్పూర్ మండలంలో ఆరు రెవెన్యూ క్లస్టర్లలో ప్రస్తుతం గ్రామ పరిపాలన అధికారులుగా రవీందర్ పేరా పల్లి, జ్యోతి నాగారం, నాగరాజు రొంపి కుంట క్లస్టర్లలో విధుల్లో నియమితులైనారు. అలాగే మరో జీపీవో అశోక్ తో పాటు అలాగే దాసరి రాజేందర్ ,మంథని కృష్ణ, లకు క్లస్టర్లను కేటాయించలేదు. వీరికి గుండారం, జూలపల్లి, కమాన్ పూర్ క్లస్టర్లకుసంబందించినబాధ్యతలుఅప్పగించనున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టవద్దని ఎంపీడీవో దివ్య దర్శన్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని గర్రెపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులతో సమావేశము ఏర్పాటుచేసి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు ఎప్పటికప్పుడు విడత ల వారిగా డబ్బులు జమ వుతున్నాయన్నారు. ఈ నెలాఖరు లోగా ప్రారంభం కానీ ఇల్లు రద్దు చేయ బడతాయని తెలిపారు.తాపీ మేస్త్రీలతో మాట్లాడి ఎక్కువ సంఖ్యలో ఇండ్లు గుత్త పట్టి ఇళ్ల నిర్మాణాన్ని ఆలస్యం చేయవద్దని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణము 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 అడుగులు మించకుండా పూర్తి చేయాలని సూచించారు.

## సెంటినరీ కాలనీ క్వార్టర్స్‌కు మరమ్మతులపైచర్చ

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గుర్తింపు సంఘం అయినటువంటి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి) ప్రతినిధులతో శుక్రవారం జి.ఎం కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వర రావు లతో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎం.రామచంద్రారెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు.ఈ సమావేశంలో భాగంగా ఓసిపి1లో ఇ.పి ఫిట్టర్స్, ఎలక్ట్రిషన్ ఖాళీ లను భర్తీ చేయడం, ఓ.సి.పి1,ఓ.సి.పి2 లో గ్రేడర్స్ సమస్యను తీర్చాలని, సి హెచ్ పి సైలో 1వ గేట్ వే బ్రిడ్జి నుండి 2వ గేట్ వరకు ప్రహరీ గోడ నిర్మించడం, సెంటినరీ కాలనీ క్వార్టర్స్ మరమ్మతులు చేయడం, జి.టి హాస్టల్ లో మూడు రూములు ఉద్యోగుల కుటుంబాలకు కేటాయించడం, రాణి రుద్రమ దేవి క్రీడా ప్రాంగణం లో వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేయడం, పంచ్ ఎంట్రీ త్రీ సిమ్ వరకు త్రాగు నీరు అందించడం, ఓసిపి2 ఉపరితల గని లో నూతన విశ్రాంతి గది, ల్యాంప్ రూమ్ ను నిర్మించడం అంశాలపై చర్చించారు. జి.ఎం.మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు జూపాక రామ్ చందర్, డి.తిరుపతి రావు, రాఘవ, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర బాబు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు సి.హెచ్.వెంకట రమణ, జె.రాజశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ మహిళలకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ



**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణి సేవా సమితి ద్వారా వివిధ నైపుణ్యాభివృద్ధి కోర్సులలో నిరుద్యోగ మహిళలకు ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల సేవాఅధ్యక్షురాలుఎన్.అలివేణి సుధాకరరావు అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సెంటినరీ కాలనీ, రత్నాపూర్, ఆదివారం పేట, లాధ్నాపూర్ గ్రామాలలో నిర్వహించినటువంటి టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు తెలంగాణ ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హాల్ నందు 183 మంది శిక్షణ పొందిన మహిళలకు రాత పరీక్ష నిర్వహించడం జరిగింది. రాత పరీక్ష కు హాజరైన అభ్యర్థులకు ప్రశ్న పత్రాలను అందజేసి ప్రారంభించారు.తదుపరి పరీక్షలను రామగుండం 3 సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ద్వారా వివిధ విభాగాలలో నిర్వహించిన ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు హాజరైన వారు శిక్షణకే పరిమితం కాకుండా రోజూ సాధన చేసి ప్రస్తుతం ఉన్న మార్కెట్ లో పోటీ పడే విధంగా మరింత నైపుణ్యాన్ని సంపాదించాలన్నారు. అంతేకాకుండా కొంతమంది ఒక యూనిట్ గా ఏర్పడి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు తయారుచేసి ఆర్థికంగా బలపడాలన్నారు.భవిష్యత్తులో కూడా సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబ సభ్యులతో పాటు పరిసర గ్రామాల నిరుద్యోగ యువత కోసం ఎన్నో నైపుణాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ పి.రాజేశం, హైదరాబాద్ విభాగం సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ డి.ఎస్.శివకుమార్, ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతినిధి రాజశేఖర్, సేవా కార్యదర్శి ఆర్.ఉమదేవి, సంయుక్త కార్యదర్శి బి.అరుణ పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి.. బాధితుల నిరసన



**ప్రజాపక్షం/ రామగిరి :** తమ వద్ద నుండి భూమి విక్రయం పేరుతో అలాగే అక్కర నిమిత్తం... తీసుకున్న లక్షలాది రూపాయల డబ్బులు తిరిగి ఇవ్వకుండా.. మాపైననే పిర్యాదులు చేస్తూ.. భయబ్రాంతులకు గురించేస్తున్న పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ మండలం రొంపికుంట గ్రామానికి చెందిన గుమ్మడి హైమావతి శ్రీనివాస్ ఇంటి ముందు బాధితులు శుక్రవారం మా డబ్బులు మాకు ఇప్పించండి.. మాకు ప్రాణ రక్షణతో పాటు న్యాయం చేయండి అంటూ నినదిస్తూ ఆ గ్రామానికి చెందిన వారితో పాటు ఇతర గ్రామాలకు చెందిన వారు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే వారి ఇంటి ముందు వంట వార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగకుంటే ఇక ముందు వారి ఇంటి వద్దనే వంట వార్పు చేసుకుంటూ.. న్యాయం జరిగే వరకు నిరసన వ్యక్తం చేస్తామంటూ హెచ్చరించారు. తమకు రావాల్సిన డబ్బులు.. భూములు ఇప్పించే విధంగా వారికున్న ఆస్తులను జాప్తు చేసైనా తమకు ఉన్నత అధికారులు, పోలీసులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.బాధితులుమాట్లాడారు.కష్టపడి సంపాదించిన డబ్బులను తమ వద్ద నుంచి తీసుకొని ఇలా మోసానికి గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అంతేకాకుండా తమ పైన ఫిర్యాదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు.

## వైద్య శిబిరం సద్వినియోగం

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో నిర్వహించబడుతున్న పశువైద్య అధికారుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ రూరల్ మండలంలోని చర్లభూత్కూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో పాడి పశువుల ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఎన్.లింగారెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతుల లాభనష్టాలను ప్రభావితం చేసే అంశాలలో పాడి పశువుల పునరుత్పత్తి సమస్యలు అత్యంత కీలకమన్నారు. క్షేత్రస్థాయిలో పాడి పశువులు ఎక్కువగా ఉండే గ్రామాలలో ఉచిత గర్భకోశ నివారణ శిబిరాలు నిర్వహించి అప్పటికప్పుడే పరీక్షలు నిర్వహించి తగిన మందులు పంపిణీచేస్తామన్నారు. సహాయ సంచాలకుడు డా.వినోద్ కుమార్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య అధికారి డా.సత్యప్రసాద్ రెడ్డి, శిక్షణ కేంద్రం డాక్టర్లు ఎం.కోటేశ్వర్‌రావు, సాయిచైతన్య, దివ్య, బొమ్మకల్ పశువైద్యాధికారి జ్యోత్స్న, కొత్తపల్లి డాక్టర్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, డెయిరీ ప్రెసిడెంట్ పంది శంకర్, లింగంపల్లి కొమురయ్య ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/రామగిరి :** పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ మండలంలో పలు బాధిత కుటుంబాలకు శుక్రవారంసుందరం ఫౌండేషన్ ఫౌండర్, మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి పటేల్ ఆధ్వర్యంలో బియ్యం ఆర్థిక సాయం అందజేశారు.కమాన్పూర్ స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్లాం నగర్ చెందిన మృతుడు గౌసోద్దీన్ కూతురు జేబా వివాహానికి 2564/ ఆర్థిక సాయంతో పాటు, పాత ఎస్సీ కాలనీలోని పేద కుటుంబానికి చెందిన వేల్పుల రాజమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబానికి 25 కేజీల బియ్యం మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి పటేల్ సహకారంతో ఫౌండేషన్ సభ్యులు అందజేసారు. ఆపదలో ఉన్న వారికి అండగా ఉండడం సుందరం ఫౌండేషన్ యొక్క ముఖ్య ఉద్దేశమని సుందర ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి పటేల్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చెన్నోజు చంద్రశేఖర్, కన్నూరి నగేష్, దేవునూరి చంద్రమౌళి, ఖాజా పాషా, తాజ్, మఖ్బూల్, సుద్దాల సంపత్,తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పట్టవా?

**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్ జి 3 ఏరియా బి ఎం ఎస్ వైస్ ప్రెసిడెంట్ అరుకల ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ జి త్రీ జిఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికుల వారసత్వ ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని,సింగరేణిలో జరుగుతున్న అవినీతిని సీబీఐ చేత విచారించాలని సింగరేణిలో రాజకీయ జోక్యం ఉండకూడదని ,సింగరేణి కార్మికులకు సొంత ఇల్లు కావాలని, ట్రాన్స్కో జెన్కో సుమారు 42 వేల కోట్ల రూపాయలను సింగరేణి కి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని,సింగరేణి కార్మికులకు లాభాల వాటా వెంటనే చెల్లించాలని, మెడికల్ బోర్డును వెంటనే పెట్టాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఐ పవర్ వేతనాలు ఇవ్వాలని, బొగ్గు గనుల లో కాలుష్యం నియంత్రించాలని, బొగ్గు గనుల లో ప్రమాదాలను వెంటనే అరికట్టాలని, సింగరేణిలో మిగిలిన క్వార్టర్స్ కాంట్రాక్ట్ కార్మికులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పర్సనల్ పీఎం సుదర్శన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రౌతు రమేష్ పటేల్, వేణుగోపాలరావు మాదాసు రవీందర్ ,అరకల ప్రసాద్, జానీ, కృష్ణ ,రమేష్, వెంకటేష్, వెంకట్ పాల్గొన్నారు.

# పల్లెల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

**ప్రజాపక్షం/కొడిమ్యాల:** పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎంఎల్‌ఏ మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో 46 మంది లబ్దిదారులకు రూ.12,16,500 రూపాయల విలువల గల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీచేసి, స్థానిక జడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను ప్రారంభించారు. అనంతరం దమ్మయ్యపేట గ్రామంలో వరాధారాయ చెరువును పరిశీలించి త్వరితగతిన పనులు చేపడతమాన్నారు. అంగన్‌వాడీ నూతన భవనానికి



భూమిపూజ చేసి వడ్డెర కుల సంఘం భవనం ప్రారంభించారు. స్థానిక మహిళల కోరిక మేరకు బతుకమ్మ తెప్ప నిర్మాణం హైమాస్ లైట్లను పండుగలోపు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో దమ్మయ్యపేట గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌వో కిరణ్, ఎంపీడీవో స్వరూప, ప్యాక్స్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, చొప్పదండి ఏయంసి చైర్మన్ కొత్తురి మహేష్, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గడ్డం జీవన్ రెడ్డి, నాయకులు చిలివేరి నారాయణ, పిడుగు ప్రభాకర్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి , కొలకని సత్యం, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** చిరుధాన్యాలు ఆరోగ్యానికి శ్రేయస్కరమని రాజన్నపేట గౌతమి ఎంటర్‌ప్రైజెస్,బొప్పాపురం గ్రామంలో మారుతి మిల్లెట్ స్టోర్స్ ప్రారంభించారు.ఇందిరా మహిళ శక్తి 2025 స్టాల్‌లను ఉమ్మడిజిల్లా కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో మిల్లెట్స్‌పై అవగాహనలో మహిళామణులు పాల్గొన్నారు.చిరుధాన్యాలతో చేసిన పిండి,రాగి,బొన్న,గట్కా,గోదుమపిండి,పచ్చజొన్నలు, వరిపిండి,కారం,పసుపు,అల్లం,వెల్లుల్లి పేస్ట్ సెర్ఫ్ అద్వర్యంలో ప్రదర్శించినట్లుగా మీడియాతో మిల్లెట్ నిర్వాహకులు చెటుపల్లి పద్మ తెలిపారు.ఇందిర మహిళశక్తిమినిసరస్‌ఫేయిర్‌లోపాల్గొన్నారు.వీరు ఈశ్వర్ స్వశక్తి ఉత్పత్తిలో స్పైసెస్ గురించి వివరించారు.
ఘనంగా మిలాద్‌ఉన్‌నబీ జన్మదిన వేడుక

## ప్రమాదకరంగా మట్టిరోడ్డు..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండలంలోని రాయపల్లి బ్రిడ్జివాగు దాటి వీర్నపల్లికి వెళ్లే మార్గంలో అల్మాస్‌పూర్ ఎల్లమ్మ గుడి దగ్గర మట్టి రోడ్డు పెద్దగుంతల మయంగా మారింది,ప్రయాణీకులు ఆదమరిచి చూడకపోతే అందులోనే పడి గాయాలపడుతున్నామని ద్విచక్రవాహనదారులు అంటున్నారు. దీనికి తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు భారిగా కయ్యలు ఏర్పడ్డాయి.వాహనదారులకు ఈ రోడ్డు శాపంగా మారుతుందని ఆవేదన చెంతున్నారు.ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని బీజేపి నాయకుడు సింగరవేణి కృష్ణహరి ఓ సందర్భంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మండల ఇన్‌చార్జికి సన్మానం

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** భారతీయ జనతా పార్టీ మండల ఇంచార్జీగా బాద్యతలు స్వీకరించిన జిల్లా కార్యదర్శి సాంబారి కళావతిని బిజెపి మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. అలాగే గ్రామంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షురాలు ఎర్ర లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి కాంతయ్య చారి, నాయకులు మోరపు జలపతి, కుంట రాజేందర్, మామిడాల గంగాధర్, వెంకటేష్, పన్నాల శ్రీనివాస్, ముత్యాల గంగారాజం తదితరులు ఉన్నారు.

## విష జ్వరాలు ప్రబలుతున్నాయి.. పట్టించుకోండి

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** వర్షాలు కురిసి వరద నీరు ఇళ్ల చుట్టూ చేరి దోమల బెడదతో మండల వ్యాప్తంగా గ్రామాలలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. రాఘవపేట గ్రామంలోని ఆరో వార్డులో ఇళ్ల మధ్యనే మురుగు నీరు చేరి డెంగ్యూ లాంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయని అధికారులుపట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మురుగు నీరు ఇళ్లకు సమీపంలోనే దరిచేరి ఉండడంతో దుర్గంధపు వాసనతో ముక్కు మూసుకునే పరిస్థితి తలెత్తుతుందని అంతేకాకుండా దోమల బెడద ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చాలా గ్రామాలలో డ్రైనేజి వ్యవస్థ సరిగా లేక శానిటేషన్ నిర్వహించక గ్రామాలు కంపు కొడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మండల స్థాయి అధికారులు స్పందించి గ్రామాలలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించి రోగాలు దరి చేరకుండా చూడాలని యువకులు కోరుతున్నారు.

## విజయవంతంగా ముగిసిన 69వ స్కూల్‌గేమ్స్

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జిఎఫ్) సారంగాపూర్ మండల స్థాయి ముగింపు పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. సారంగాపూర్ మండల విద్యాధికారి కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల రెవెన్యూ అధికారి వహీద్ బహుమతుల దాత ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు ఆటలతోపాటు విద్యలో కూడా ముందుండాలని విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాని కోసం నిరంతరం కృషి చేయాలని, ఉన్నత స్థానానికి చేరుకోవాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధతో ఉండాలని డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని



ఎమ్మార్వో వహీద్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామచంద్ర రెడ్డి, శేకుట శేఖర్ యాదవ్, బేర మహేష్, వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ రవీందర్, వేణు, రాము, షాబుద్దీన్, మంజూల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘ ఆధ్వర్యంలో గాజుల వేడుకలు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు గాజుల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుని గాజుల వేడుకలు జరుపుకోవాలని, పురుషులు సైతం కండువాలు కప్పుకుని వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మ ణ్, సంఘ సభ్యులు రాజేశం, స్వామి, పల్లి చైతన్య, రాజ్ కుమార్, సంఘ మహిళలు తదితరులు ఉన్నారు.

## విశారదన్ మహారాజు సభకు తరలిరండి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ఈనెల 15న జగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్లో జరిగే బీసీ, ఎస్సీ , ఎస్టి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజు సభ సమావేశానికి యువతి యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవరామ్ అన్నారు.ఈ సందర్భంగా గొల్లపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన దళిత బహుజనుల వర్గాలను చైతన్య పరచడమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తు మనకోసం ఎనలేని త్యాగాలు చేస్తున్న విశారాదన్ మహారాజుకు మనము అండగా ఉండవలసిన బాధ్యత ప్రతి బిసి ఎస్సీ ఎస్టీ ప్రజలపై ఉందని అన్నారు. ఈ నెల 15న జగిత్యాలలో జరిగే డాక్టర్ విశారాదన్ మహారాజు యొక్క అద్భుతమైన ప్రసంగాన్ని మండలంలోని బిసి ఎస్సీ ఎస్టీ యువతి యువకులు ప్రజలు మేధావులు ,అద్వకేట్స్ ,స్టూడెంట్స్ ,అధ్యాపకులు ,డాక్టర్స్ విద్యార్థిని విద్యార్థులు యువజనులు బహు సంఖ్యలో పాల్గొని విశారదన్ మహారాజు సభ సమావేశమును విజయవంతం చేయాలని కోరారు.

## సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** విజ్ఞానాన్ని పంచుతూ సమాజభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గుజ్జె గంగాధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేములకుర్తి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల(బండమీది బడి) ఆవరణలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌జయంతి సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగామణి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక అయి ప్రశంసా పత్రం పొందారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో గ్రామ నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో ఉత్తమ ఉపాధ్యాయురాలిని శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు చేసిన సేవలను గుర్తించారు. విద్యార్థులు అభివృద్ధి కోసం పాటుపడుతున్న సిబ్బంది తీరును అభినందించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మిఠాయిల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎడపల్లి గంగారెడ్డి, బిజెపి నాయకులు మాలేపు శ్రీనివాస్, కోటగిరి వెంకట స్వామి, కాంగ్రెస్ నాయకులు పుప్పాల నాగేష్, శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు గుమ్మల అరవింద్, అప్పని అనిల్, చింతం వెంకటేష్, పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల్లో ప్రణవ్ పర్యటన

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి హుజురాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో వరద చుట్టుముట్టిందని దానికి తగ్గట్టుగా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని,త్వరలోనే హుజురాబాద్ నాలాలపై మాస్టర్ ప్లాన్ తయారు చేసి పరిష్కారానికి కృషి చేస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం ఉదయం నుండే గాంధీ నగర్, బుడగ జంగాల కాలనీ, మామిండ్లవాడ, గ్యాస్ గోదాం ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆయన పర్యటించారు. ప్రాంతాల్లో పర్యటిస్తున్న క్రమంలో పలువురు వార్డుల్లో నెలకొన్న సమస్యలను దృష్టికి తీసుకురాగా, వాటిని అధికారులతో చర్చించి పరిష్కారినికి కృషి చేస్తానని వరద సమస్యపై శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలను సిద్దం చేసేలా కలెక్టర్‌తో మాట్లాడామని అన్నారు. వారి వెంట హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ధర్మపురి ఆలయానికి రూ. లక్ష విరాళం

**ప్రజాపక్షం / ధర్మపురి :** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహ స్వామి దేవాలయానికి బాన్సువాడకు చెందిన ఓ భక్తుడు శుక్రవారం రూ.లు లక్ష విరాళంగా అందించారు.బాన్సువాడ పట్టణానికి చెందిన రమాకాంత్ రావు కులకర్ణి దంపతులు పూజలు నిర్వహించి దేవస్థానం కార్యాలయంలో కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్‌లకు సదరు మొత్తాన్ని అందించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరేళ్ల శ్రీనివాస చార్యులు ఉన్నారు.

## సద్దుల బతుకమ్మ, దసరా ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** రాబోయే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను హుజురాబాద్‌లో ఘనంగా నిర్వహించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హుజురాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఆడపడుచులకు పెద్ద పండుగ అయిన సద్దుల బతుకమ్మను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు దగ్గర ఉండి పనులను పర్యవేక్షించి ఘనంగా జరిగేలా చూడాలని అన్నారు. బతుకమ్మ కేంద్రాల వద్ద మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. కనీవిని ఎరగని రీతిలో దసరా పండుగ నిర్వహించాలని అన్నారు. అలాగే పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని, అర్హులైన వారందరికి నిష్పక్షపాతంగా కేటాయింపులు జరగాలని అన్నారు. హుజురాబాద్‌లో విపరీతంగా కోతుల బెడద ఉందని, గతంలో కోతుల వల్ల చాలా మంది ఇబ్బందికి గురైన సంఘటనలతో పాటు ఒక వ్యక్తి మరణించిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. కోతుల బెడదను నివారించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షాలతో జరిగిన విపత్తులో ఆస్తి నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు సూచించారు. వర్షాల వల్ల ఇబ్బందులను ఎదుర్కొన్న కుటుంబాల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు.రివ్యూ మీటింగ్‌లో కమిషనర్ సమ్మయ్యతో పాటు అధికారులు పాల్గొన్నారు.

## దుర్గామాత నవరాత్రోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహిద్దాం

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** త్వరలో కరీంనగర్‌లో దుర్గాదేవి నవరాత్రోత్సవాలు, దసరా ఉత్సవాలను అందరూ కలిసికట్టుగా ఉండి బ్రహ్మాండంగా నిర్వహిద్దామని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కొత్తపల్లిలోని వెలిచాల కార్యాలయంలో దుర్గాదేవి నవరాత్రోత్సవాలు, దసరా వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై రాజేందర్‌రావు సమావేశంలో కాంగ్రెస్ నాయకులతో చర్చించారు. కరీంనగర్‌లో ఒకటి రెండు చోట్ల పెద్ద ఎత్తున దుర్గామాతను ప్రతిష్టించి వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని పేర్కొన్నారు. బతుకమ్మ సంబరాలు, దాండియా కార్యక్రమాన్ని మహిళలతో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుదామని తెలిపారు. మాజీ కార్పోరేటర్లు ఆకుల నర్సయ్య, ఆకుల ప్రకాష్, అర్ష మల్లేవం, కోటగిరి భూమాగౌడ్, గంట శ్రీనివాస్, నాయకులు బొమ్మ ఈశ్వర్‌గౌడ్, మూల రవీందర్‌రెడ్డి, పిట్టల రవీందర్, కాంగ్రెస్ నాయకులున్నారు.

# పాఠశాలల భవనాలు విద్యార్థులకు అనుకూలంగా లేవు..

**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్‌:** నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు,సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనాలను వెంటనే గుర్తించి,వాటిని పునర్నిర్మించాలని కోరుతూ ఎఐఎస్‌ఎఫ్ నిర్మల్ జిల్లా కమిటీ జిల్లా అదనపు కలెక్టర్ జె.సి.కిషోర్ కుమార్ వినతి పత్రం సమర్పించింది.ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాష్ నేతృత్వంలో సమర్పించిన ఈ వినత పత్రంలో విద్యారంగంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రస్తావించారు.ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల భవనాలు ఏమాత్రం విద్యార్థులకు అనుకూలంగా లేవని,చాలా చోట్ల కనీస సౌకర్యాలు కూడా లేవని వారు పేర్కొ



న్నారు.ప్రత్యేకంగా,ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని,విద్యార్థుల భద్రతకు ప్రమాదకరంగా మారాయని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని,శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.కొత్త భవనాల నిర్మాణానికి,ఇప్పటికే ఉన్న వాటిని పునరుద్ధరించడానికి తక్షణమే నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.విదాయరంగంలో నాణ్యతను పెంచడానికి,విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడానికి నిధల కేటాయింపు అత్యవసరం అని వారు నొక్కి చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉప అధ్యక్షుడు అస్లాం,నాయకులు సన్నిహిత్,తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం వెంటనే స్పందించి,తగిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ఓటమి విజయానికి తొలి అడుగు..

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నెరడిగొండ మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో గత 3 రోజుల నుంచి జరుగుతున్న ఎమ్మెల్యే కప్ సాఫ్ట్ బాల్ టౌర్నమెంట్ లో విజయం సాధించిన క్రీడాకారులకు ఆదిలాబాద్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు,ఎమ్మెల్యే అనిల్ జాదవ్,సొంత నిదులతో నగదుతో పాటు ట్రోఫీ లను శుక్రవారం గెలుపొందిన జట్లకు అందజేశారు.క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఓటమి విజయానికి తొలి అడుగుగా భావించి మళ్లీ జరిగే పోటీలలో గెలుపొందాలని ఓడిపోతేనే అనుభవం తోడవుతుందని అన్నారు.సాఫ్ట్ బాల్ బాలికల విభాగంలో బుగ్గరం విద్యార్థినిలు మొదటి బహుమతి,నెరడిగొండ బాలికలు రెండవ బహుమతి సాధించగా బాలుర జట్లు నెరడిగొండ మొదటి రెండవ బహుమతి సాధించారు ఈ కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మ,సాఫ్ట్ బాల్ సెక్రటరీ గంగాధర్,బుగ్గరం గురుకుల ప్రిన్సిపల్ కృష్ణవేణి,పిడీలు రమణ,అఖిల్,మమత,పిటి గంగమని,నాగరాజు, శ్యామ్, అనిల్,గణేష్,సాయి కిరణ్,క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## పనులనునిర్ణీతగడువులోగాపూర్తిచేయాలి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ,పంచాయతీరాజ్ శాఖల ఆద్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు.నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో అంగన్వాడీ భవనాలు,పాఠశాలలమరుగుదొడ్లు,ఉపాధిహామీ నిధుల ద్వారా చేపట్టిన పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ,ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు స్వయంగా పనులను పర్యవేక్షించాలని సూచించారు.అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి



చేయడంలో ఎటువంటి జాప్యం చేయకూడదని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ విజయలక్ష్మి ,పంచాయతీ రాజ్ ఈఈ చందునాయక్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు రాజశేఖర్‌కు సన్మానం

**ప్రజాపక్షం/మోర్తాడ్‌:** నిజామాబాద్‌జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన గాండ్ల రాజశేఖర్ ను మోర్తాడ్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులుగా ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్, గణితంకు సంబంధించిన మూడు మండలాల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం జరిగింది. భోజన విరామ సమయంలో జిల్లా స్థాయి ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయునిగా సన్మానం పొందిన ఎర్గట్ల ఉన్నత పాఠశాల బౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు సైన్స్ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ ను



ఉపాధ్యాయులు సన్మానం చేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, కాంప్లెక్స్ కార్యదర్శి రవీందర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవగాహన

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై లబ్ధిదారులకు, మేస్త్రీలు, ట్రాక్టర్ డైవర్లు,అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గృహ నిర్మాణ డిఇ గంగాధర్,ఏఈ సానా ఫాతిమా లు మాట్లాడుతూ రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఆదేవిధంగా ట్రాక్టర్ డైవర్లు ఇళ్ళ నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఎటువంటి ఆటంకాలు లేకుండా సమయామకూలంగా పంపిణీ చేయాలని,మేస్త్రీలు నిర్మాణ పరులు నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ అజీజ్ అహ్మద్ ఖాన్,ఎంపీడీవోవో అరుణ రాణి,ఎంపీఓ గోవర్ధన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 19 నుండి ఫొటో ఎక్స్‌పో.. పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/అంతర్గాం :** హైదరాబాద్‌లో ఈనెల 19, 20, 21వ తేదీల్లో నిర్వహించే ఫోటో ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో చేపట్టారు. ఫోటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్ పాల్గొని పోస్టర్లను ఆవిష్కరించారు. మండలంలోని ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దారును అసోసియేషన్ నాయకులు సత్కరించారు. అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇర్ఫాన్, పెద్దపల్లి మండల అధ్యక్షులు వనపర్తి శ్రీనివాస్, స్థానిక అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుందిల్ల రాకేష్, ప్రధాన కార్యదర్శి కావలి నరేష్, కోశాధికారి బుర్ర వినయ్ సాగర్, జాయింట్ సెక్రటరి దబ్బట రవి, ఆర్గనైజింగ్ సెక్రటరి మామిడి సాయి చరణ్, ఆర్గనైజర్ కందుగుల కుమార్, గౌరవ సలహాదారుడు అర్శనపల్లి రాజు, కేడం శంకర్, మోదుంపల్లి రామస్వామి, కొత్తూరి రామస్వామి, గోశిక శ్యామ్, కోట విశాల్, రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటి డైరక్టర్ పానగంటి సత్యనారాయణలు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్ మండలంలోని రోల్ మామడ,తేజపూర్,గ్రామాల లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ ఫలాలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు.మండల అధ్యక్షడు ఆడే వసంతరావు, సీనియర్ నాయకులు రాజు రెడ్డి,నాయకులు ఎండి సద్దాం,స్వామి, తదితరులున్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**ప్రజాపక్షం / ముస్తాబాద్ :** మోదీ కానుక పేరుతో 85 సైకిళ్లను ముస్తాబాద్ ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుండి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుండి స్కూల్ దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాలు లేక ఆటోలు, బస్సుల్లో వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత స్పెషల్ క్లాసులకు హాజరు కావాల్సి ఉంటుంది. దీని వల్ల పొద్దుపోయే దాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తుంది. దీనిని దృష్టిలోఉంచుకుని టెన్త్ బాలబాలికలకు రవాణా ఇబ్బంది ఉండకూడదనే సదుద్దేశ్యంతో బండి సంజయ్ కుమార్ ప్రధాని మోదీ కానుకగా సైకిళ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎంఈవో రాజిరెడ్డి, ఎస్సై గణేష్, మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్, జిల్లా ఉపాధ్యాక్షుడు మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మాజీ మండల అధ్యక్షులు కస్తూరి కార్తీక్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు గోపి, మహేశ్వరీ, బీజెపి సీనియర్ నాయకులు మీసా శంకర్, వంతడుపుల సుధాకర్, సందేవేని రాజు, పప్పుల శ్రీకాంత్, కోలా కృష్ణ ఉన్నారు.

## జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/జమ్మికుంటః** జమ్మికుంటలో ప్రథమ శ్రేణి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు సహా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అనుమతి కొరకు హుజురాబాద్‌లో ఉన్న సెకండ్ అడిషినల్ కోర్టును నెలకొల్పాలని కోరతూ హైకోర్టు న్యాయమూర్తి,కరీంనగర్ జిల్లా పోర్టుపోలియో ఇంచార్జి జడ్జి తుకారాంజీని హైకోర్టులోని వారి చాంబర్‌లో జమ్మికుంట న్యాయవాదులు కలిసి వినతి పత్రం సమర్పించారు. జమ్మికుంట, వీణవంక మండలాల్లో దాదాపు 5 వేల పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతవాసులు హుజురాబాద్ వరకు వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రజల ఆకాంక్షతో పాటు రాజకీయ నాయకులు, మేధావులు, సామాజిక ఉద్యమకారులు జమ్మికుంటలో కోర్టు నెలకొల్పాలని ఆశిస్తున్నారని జడ్జికి తెలిపారు. న్యాయవాదులు వంగల పవన్‌కుమార్, ఏబూసి లింగారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌బాబు, నక్క సత్యనారాయణ, మొలుగూరి సదయ్య, బార్ అసోసియేషన్ హుజురాబాద్ వైస్ ప్రెసిడెంట్ నూతల శ్రీనివాస్, రావికంటి మధుబాబు, గుండ వరప్రసాద్ తదితరులున్నారు.

## 14న బిసి రాజ్యాధికార సదస్సు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః** కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఈ నెల 14న ఆర్టీసీ వర్క్‌షాప్ ఎదురుగా గల పద్మశాలి భవన్‌లో ఉదయం 10 గంటలకు తలపెట్టిన బిసి మేధావుల సదస్సును విజయవంతం చేయాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బిసిలకు రావాల్సిన హిస్సా, ఇజ్జత్ ,హుకుమత్ వంటి హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. బిసిలకు జనాభా ప్రాతిపదికన ఆర్థిక వాటా, సమాజంలో ఆత్మగౌరవం, రాజ్యాధికార సాధన వంటి ముఖ్యమైన మూడు అంశాలపై సదస్సులో దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. బిసి రాజ్యాధికార సాధనకై నిర్వహిస్తున్న సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి బిసి మేధావులు, విద్యావేత్తలు, వైద్యులు, న్యాయవాదులు, కవులు, రచయితలు, కళాకారులు, వివిధ బిసి సంఘాల నేతలు, బిసి నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/జమ్మికుంటః** జమ్మికుంట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న 69వ ఎస్‌జిఎఫ్ పోటీలు మూడు రోజులు ఉత్సాహంగా కొనసాగాయి. శుక్రవారం ఎస్‌జిఎఫ్ ముగింపు కార్యక్రమాన్ని ఎంఈవో హేమలత ఆద్వర్యంలో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ పాల్గొని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం అండర్ 14 విభాగంలో వాలీబాల్ మొదటిస్థానంలో జడ్పిహెచ్ఎస్ కోరపల్లి, రెండో స్థానంలో సెయింట్ థామస్, అండర్ 17 వాలీబాల్ జడ్పిహెచ్ఎస్ బాయ్స్ మొదటి స్థానం, రెండవ స్థానంలో సోషల్ వెల్ఫేర్, అండర్ 14,17 ఖోఖోలో మొదటి స్థానంలో సోషల్ వెల్ఫేర్, రెండో స్థానంలో జడ్పిహెచ్ఎస్ కోరపల్లి విధ్యార్థులు నిలిచారు. అండర్ 14 కబడ్డీ మొదటి స్థానంలో విద్యోదయ, రెండో స్థానంలో జడ్పిహెచ్ఎస్ కోరపల్లి నిలిచాయి. గెలుపొందిన విధ్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు మండల ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శ్రీలత తెలిపారు. బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, కోరపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, పిడి శ్రీనివాస్, ప్రేమలత, రేణక, పిఈటిలున్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలి

**ప్రజాపక్షం/జమ్మికుంటః** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో మహిళలు ముందడుగు వేసి అభివృద్ధిని సాధించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. శుక్రవారం జీవన జ్యోతి పట్టణ సమాఖ్య సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ హజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ అయాజ్ మాట్లాడుతూ పట్టణంలో మహిళలు తీసుకునే లోన్‌తో ఆర్థికంగా ఎదగాలని, జమ్మికుంట మున్సిపాలిటీ ప్లాస్టిక్ నిర్మూలనకు మహిళలు ముందడుగు వేస్తే సంపూర్ణంగా నిర్మూలించవచ్చన్నారు. మహిళా సంఘాలలో ఉన్న సంఘ సభ్యులకు జ్యూట్ బ్యాగ్స్ అందించామని తెలిపారు. ఈఈ శ్రీకాంత్, జీవన జ్యోతి పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు రాణి, కార్యదర్శి మౌనిక, కోశాధికారి గీత, సిఎల్ ఆర్‌పిలు జ్యోతి,మంజుల, టిఎల్ఎఫ్ ఆర్ సరళ, సమాఖ్య అధ్యక్షులున్నారు.